మోటారు సైకిళ్ల చోరీ ముఠా అరెస్టు

14 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పోలీసులు మోటారు సైకిళ్లు చోరీ చేస్తున్న ముఠాను మంగళవారం అరెస్టు చేశారు. డిఎస్‌పి మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం టౌన్, తణుకు టౌన్, తణుకు రూరల్, అత్తిలి, పెంటపాడు, నిడమర్రు, గణపవరం ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని మంగళవారం సాయంత్రం పట్టణ శివార్లలో నల్లజర్లరోడ్డులో భారత్ పెట్రోల్ బంక్ దగ్గరలో అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. వారి వద్ద నుండి 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దొంగలను పట్టుకున్న పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, పట్టణ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందిని డిఎస్‌పి మూర్తి అభినందించారు.

ఉ(ము)ప్పుటేరు..!

చౌడుబారుతున్న పంటభూములు - పాలకుల నిర్లక్ష్యానికి నిలువటద్దం ఉప్పుటేరు - డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను పునరుద్దరణ తప్పనిసరి

ఉప్పుటేరులో పేరుకుపోయిన కిక్కిస, జమ్ము

ప్రజాశక్తి - కాళ్ల

దశాబ్దాలుగా ఉప్పుటేరు సమస్య పరిష్కారం కావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది పాలకులు మారుతున్నా ఈ సమస్యపై దృష్టి పెట్టడం లేదు. కృష్ణా, తూర్పు, పశ్చిమ డెల్టాలోని సుమారు 6.60 లక్షల ఎకరాల్లోని మురుగు నీటిని సముద్రంలోకి తరలించే ప్రధాన డ్రెయిన్. కొల్లేరు ముంపు నీటితోపాటు పశ్చిమ, ఏలూరు కృష్ణా జిల్లాల్లో వందకుపైగా మేజర్ డ్రెయిన్లు, 67 మీడియం మైనర్ డ్రెయిన్లలోని మురుగునీరంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. సాగునీటికి, ఆక్వా రంగానికి నీటి అవసరాలను ఉప్పుటేరు తీరుస్తుంది. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. మూడు జిల్లాల పరిధిలో ఉప్పుటేరు డ్రెయిన్ ఉంది. దీనిపై పర్యవేక్షణ కొరవడింది. గుర్రపుడెక్క, తూడు పెద్దఎత్తున మేటలేస్తోంది.

ఉప్పుటేరు స్వరూపం

కొల్లేరు సరస్సు ముఖద్వారం పందిరిపల్లిగూడెం వద్ద ఒకటో మైలు రాయి నుంచి సముద్రపు ముఖద్వారం 49వ మైలురాయి వరకూ ఉప్పుటేరు ప్రవహిస్తోంది. సుమారు 68 కిలోమీటర్ల మేర దూరం వరకూ ఉప్పుటేరు ప్రవహిస్తోంది. 750 మీటర్ల నుంచి 1200 మీటర్ల వెడల్పులోనూ, 36 అడుగుల లోతులో ఉప్పుటేరు 16 వేల క్యూసెక్కుల నీటితో నిండి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉప్పుటేరు పూడుకుపోవడంతో కేవలం 28 అడుగుల లోతులోనూ, 8 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో కుచించుకుపోయింది. దీంతో నీటి ప్రవాహం మందగిస్తోంది. ఫలితంగా ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్ష ఎకరాల వరి పంట నీట మునుగుతుంది. సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు అధికంగా ఎదురు ప్రవహిస్తోంది.

అటకెక్కిన మిత్ర కమిటీ సూచనలు

1964లో అప్పటి ప్రభుత్వం మిత్ర కమిటీని నియమించింది. దీనిపై ఆ కమిటీ 1977లో ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. ఉప్పుటేరు ఆరంభంలో ఆకివీడు రైల్వే వంతెన వద్ద కాలువ 36 మీటర్ల వెడల్పు ఉండగా, దానిని 200 మీటర్ల మేరకు వెడల్పు చేయాలని కమిటీ సూచించింది. తొలి విడతలో ఉప్పుటేరులో ప్రవాహ సామర్థ్యాన్ని కనీసం 15 వేల క్యూసెక్కులకు పెంచాలని స్పష్టం చేసింది. అనంతరం 1982లో అదే కమిటీ రెండోసారి నివేదిక ఇచ్చింది. అప్పటి సూచనల మేరకు 1983లో తాడినాడ, పెదలంక, మాట్లం, కలిదిండి ప్రాంతాల్లో 43 ఎకరాల భూమి సేకరించి డ్రెడ్జింగ్ పనులు చేపట్టారు. అప్పట్లో 6.6 కిలోమీటర్ల నుంచి 23.4 కిలోమీటర్ల వరకు పనులు చేసి ఆపేశారు. ఉప్పుటేరులో పూడిక తొలగించి 30 ఏళ్లు దాటింది. ప్రస్తుతం దీని ప్రవాహ సామర్థ్యం 8 వేల క్యూసెక్కులు ఉంది. కనీసం 15 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచితే రైతులకు కొంతైనా ప్రయోజనం కలుగుతుంది. 2009లో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం రూ.21.27 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. తర్వాత చాలాసార్లు అంచనా వ్యయం పెంచి ప్రతిపాదనలు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మిస్తే ఏడాదిపాటు డ్రెయిన్ నీటితోనే సాగు చేసుకోవచ్చని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బి.రోశయ్య ఆధ్వర్యంలోని కమిటీ 2007లో ప్రతిపాదించింది. 1/6 మైలు వద్ద రూ.25 కోట్లతో ఒక రెగ్యులేటర్, సముద్రం సమీపాన 43వ మైలు వద్ద రూ.25 కోట్లతో రెండో రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అవేమీ కార్యరూపం దాల్చలేదు. దీంతో వరిసాగుకు ముప్పు వాటిల్లుతోంది. భూములు చౌడుబారుతున్నాయి.

ఉప్పుటేరులో పూడిక తొలగించాలి

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

దశాబ్దాలుగా ఉప్పుటేరు సమస్య ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సమస్య పరిష్కరించడం లేదు. లక్షల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లే మార్గం ఉప్పుటేరే ప్రధానంగా ఉంది. ఉప్పుటేరులో 10 వేల క్యూసెక్కుల నుంచి 12 వేల నీటితో క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. ఉప్పుటేరు వెడల్పు, లోతు పెంచాలి. గతంలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఉప్పుటేరులో పూడిక తొలగించేవారు. గతంలో టిడిపి ప్రభుత్వం డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను మూసివేసింది. దీంతో యంత్రాలు, సిబ్బంది లేరు. సిద్దాపురంలో ఉప్పుటేరులో ఉన్న అడ్డంకులను తొలగించాలి. రైల్వే బ్రిడ్జి కింద ఖానాల్లో పూడిక ఉండటంతో నీటి ప్రవాహనికి అడ్డంకిగా ఉంది. ఉప్పుటేరు పోటు వల్ల వరి పొలాలు ప్రతియేటా ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారు. ముంపు లేని సమయంలో ఉప్పునీరు రాకుండా రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలి. వరద నీరు వెళ్లేలా సామర్థ్యం పెంచేలా చర్యలు చేపట్టాలి. ఉప్పునీరు పంట, మురుగు కాలవల్లోకి రాకుండా రైతులు సొంత ఖర్చులతో అడ్డుకట్టలు వేయాల్సి వస్తుంది. ఉప్పుటేరు ముంపు, కాలుష్యాన్ని పరిష్కరించాలి. పరిశ్రమల కాలుష్యం ఉప్పుటేరు లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. రైతులు, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉప్పుటేరు సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలి.

భీమవరం సమగ్రాభివృద్ధికి చర్యలు

డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి ఆదేశాలు

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

చెత్త ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం పట్టణాభివృద్ధిపై పక్కా ప్రణాళికతో దృష్టి సారించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం లోసరి రోడ్డులోని యనమదుర్రు గట్టుపై చెత్త డంపింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెత్త ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు అనుసరించి ప్రతి పట్టణంలో గత 20 సంవత్సరాలుగా భూమిలో నిక్షిప్తమైన లెగసి వ్యర్థాలను తవ్వి తీసి ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్చే ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా 12 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలే లక్ష్యంగా మట్టిగా మార్చే ప్రక్రియ చేపడుతున్నామని, దీని నిమిత్తం అయ్యే ఖర్చు మొత్తం రూ.96 లక్షలు సంబంధిత ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. వ్యర్థాలు ట్రీట్మెంట్ ప్లాంట్‌లో ప్రాసెస్ అయిన తర్వాత వచ్చే మట్టి వంటి మెటీరియల్‌ను ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేసి పూడ్చుకోవడానికి ఉపయోగిస్తామన్నారు. ఇప్పటికే లెగసి వ్యర్థాల ట్రీట్మెంట్ ప్రారంభమైందన్నారు. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉండటంతోపాటు ఏళ్లతరబడి భూమిలో పొరల్లో కరగకుండా మిగిలిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్పు చెందుతాయన్నారు. ప్రతి నగరంలో చెత్త అనేది పెద్ద సమస్యగా తయారైందని, ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం నగరంలోని బివి.రాజు పార్కును సందర్శించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కొలనులోని నీటిని ఫిల్టరైజేషన్ ప్రక్రియ ద్వారా స్వచ్ఛంగా ఉండేటట్లు చూడాలన్నారు. పార్కింగ్ ప్రదేశం, పార్కుకు వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రవేశద్వారాన్ని పరిశీలించి, ద్వారానికి ఆనుకుని ఉన్న తోపుడుబళ్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం గతంలో తాడేరు రోడ్డులో డంపింగ్ యార్డు నిమిత్తం కొనుగోలు చేసిన 6.5 ఎకరాల భూమిని పరిశీలించి, డంపింగ్‌కు అడ్డంకిగా ఉన్న విషయాలపై ఆరా తీశారు. ఈ స్థలాన్ని వాటర్ ఎనర్జీ ప్లాంట్ లేదా బయోగ్యాస్ మిథైన్ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. తరచూ నగరంలో అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మున్సిపల్ ఇంజినీర్ త్రినాధ్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, తహశీల్దార్ రావి రాంబాబు, సర్వే, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది ఉన్నారు.

టోల్‌ట్యాక్స్ విరమించుకోండి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర రహదారులపై టోల్‌ట్యాక్స్ విధింపును విరమించుకోవాలని, లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికీ పడుతుందని సిపిఎం వీరవాసరం మండల కమిటీ హెచ్చరించింది. ఆ కమిటీ ఆధ్వర్యాన స్థానికయ బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు, పబ్లిక్ భాగస్వామ్యం పేరుతో రద్దీ రోడ్లను గుర్తించి టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తామని సిఎం చెప్పడం తగదన్నారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పిదాలే కూటమి ప్రభుత్వం చేస్తుందనే సంకేతాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న ప్రజలపై టోల్‌ఛార్జీల మోత తగదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయ, నేతలు లింగం సత్యనారాయణ, బొర్రా ఆలమహరాజు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు

రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో ఎస్‌పి నయీమ్ అస్మీ

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ సి.నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ ఆధ్వర్యంలో మంగళవారం రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించామన్నారు. జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి చోట్ల ప్రమాద నివారణా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. జాతీయ రహదారుల జంక్షన్ల వద్ద లైటింగ్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రతా నియమాలు పాటించకపోతే విధించే జరిమానాలపై పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించేలా వారిని చైతన్యపరచాలని కోరారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్‌బ్రేకర్లు, సైన్‌బోర్డుల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎఎస్‌పి (అడ్మిన్) వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అధికారులు

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా అగ్నిమాపక శాఖాధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దగ్ధం తర్వాత ప్రభుత్వం రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరిస్థితులపై ఆరా తీస్తోంది. దీనిలో భాగంగా రికార్డుల భద్రతను పరిశీలించాలని జిల్లా ఫైర్ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా ఫైర్ అధికారి బి.శ్రీనివాసరావు స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయంలో రికార్డులు, వైరింగ్, పరిసర ప్రాంతాలను కుణ్ణంగా పరిశీలించారు. భవనం సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించింది కావడం, పైకప్పు శిథిలం కావడం, వర్షానికి తడవపకుండా పైన తాత్కాలికంగా ప్లాస్టిక్ సీట్లను కప్పి ఉంచడాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట నరసాపురం ఫైర్ అధికారి కె. రామభాస్కర్‌రావు, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ ఉన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా కృషి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు వాడకం వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, అందుకే దేశభవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేకపోతే మంచి భవిష్యత్తును కోల్పోతారని హితవు పలికారు. మత్తు పదార్థాలను రవాణా అరికట్టేందుకు జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో సెబ్ అదనపు ఎస్‌పి ఎటివి రవికుమార్, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ భాను నాయక్ పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్స్ ఎక్ట్సు సమావేశం

జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్ ఉంటే గుర్తించి నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మ్యాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్ అమలుపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు మాన్యువల్ స్కావెంజర్స్ ఉంటే వారి సమాచారాన్ని సేకరించి అందించాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

పారిశ్రామిక యాజమాన్యం అందిపుచ్చుకోవాలి..

క్లస్టర్ డెవలప్మెంట్ పథకం ద్వారా వనగూరే ప్రయోజనాలను పారిశ్రామిక యాజమాన్యం అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్లలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల యాజమాన్యాలతో క్లస్టర్ డెవలప్మెంట్ పథకంపై అవగాహనా సదస్సులో జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. 10, 15 పరిశ్రమలు ఉన్న చోట అందరికీ ఉపయోగపడేలా క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో ప్రయోజనం పొందేందుకు, ఐదు నుండి పది కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం మరియు పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 10 శాతంతో, అలాగే 10 నుండి 30 కోట్లు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం మరియు పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 20 శాతంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖా అధికారి యు.మంగపతిరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - తణుకు

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఎంసి (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులు కృషి చేయాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి సభ్యులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గత పాలనలో పాఠశాలలను పట్టించుకోకుండా పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. నాడు-నేడు వారి జేబులు నింపుకోవడం కోసమేనని ఆరోపించారు. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం మెరుగుకూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లలో క్రిమిలేయర్ వాదన అర్థరహితం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారే క్రమంలో గత ప్రభుత్వ హయాంలో నియమితులైన స్కీమ్ వర్కర్లను తొలగించడం అన్యాయమన్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బిసిలేనన్నారు. గత ప్రభుత్వ విధానాలపై మాట్లాడకుండా కార్మికుల పట్ల కక్ష సాధింపు తగదన్నారు. పౌరసరఫరాల శాఖలో అవకతవకలపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లను ఎత్తివేసే విధంగా ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు అప్పగిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించినప్పుడు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల్లో క్రిమిలేయర్ వాదన అర్థరహితమన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేలా దోషులకు 41 సిఆర్‌సి ప్రకారం నోటీసులిచ్చి విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల బాధితులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు, బాగం లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బి.రఘురాం, టి.చిరంజీవి, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ, విజయ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్ కుమార్, కె.క్రాంతిబాబు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పనులను పరిశీలిస్తు్న కమిషనర్

నరసాపురం పట్టణ పరిధిలో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన కూడలిలో, పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇ మణి పాల్గొన్నారు.

పల్లెలకు పండగొస్తోంది : ఎంఎల్ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

పల్లెల్లో పండగ వాతావరణం వచ్చేలా గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి లేకుండా అరాచక పాలన సాగించారని, కనీసం గ్రామ పంచాయతీలో చెత్త తీసేందుకు కూడా నిధులు లేని దుస్థితికి దిగజార్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో రాబోయే రోజుల్లో విప్లవాత్మక అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.5 కోట్ల 60 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముందుగా అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం ఎంపిడిఒగా విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎంపిడిఒను అభినందిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.విశ్వనాథ్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు కృష్ణా జిల్లాకు ఎంపిడిఒగా బదిలీ అయిన ఆయన ఎన్నికల అనంతరం ఎవరి స్థానాల్లోకి వారు వెళ్లాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో తిరిగి తాడేపల్లిగూడెం ఎంపిడిఒగా విశ్వనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్, ఎఒ సుజాత, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అవయవదానంపై అవగాహన ప్రదర్శన

ప్రజాశక్తి - మొగల్తూరు

అవయవదానంతో మరొకరికి సహాయపడొచ్చని ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు అన్నారు. ముత్యాలపల్లిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ అవయవ దానం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవయవదానం పట్ల సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. అవయవదానం చేయడం వల్ల ఇతర కుటుంబాల్లో వెలుగు ఇచ్చినవారవుతారని అన్నారు. అనంతరం గ్రామంలో అవయవదానంపై అవగాహన ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు చక్రవర్తి, ఉపాధ్యాయులు గుడాల తాతారావు, బి.కోటేశ్వరి, ఎంఎల్‌హెచ్ఒ పి.బంగారమ్మ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

శ్రావణ మంగళవారాల సందర్భంగా మంగళవారం గణపవరం వెలంపేటలోని ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో పాల్గొన్న ఉంగుటూరు ఎంఎల్ఎ పచ్చమట్ల ధర్మరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ జాతరలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెలమ సంఘం అధ్యక్షులు సిరపరపు శ్రీను, నాయకులు, శిరపరపు అప్పారావు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహనీయులను ఎప్పుడూ గుర్తించుకుంటూ ఉండాలని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక జూలపల్లి రోడ్డులోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం గాంధీ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో మంగళవారం వాటిని తొలగించి విగ్రహాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని కూటమి నాయకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వరరావు విగ్రహాన్ని కడిగి అనంతరం పూలమాల వేసి జాతీయ జెండాతో జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గంటా త్రిమూర్తులు, వి.రాఘవులు, చల్లా రాము, కొప్పినీడి బాబి పాల్గొన్నారు.

ఆకివీడులో జాతీయ జెండాతో ప్రదర్శన

జాతీయ జెండాతో ప్రదర్శన

ప్రజాశక్తి - ఆకివీడు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక జాతీయ రహదారిపై ప్రయివేటు విద్యా సంస్థల విద్యార్థులు స్థానిక జాతీయ రహదారిపై భారీ జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం వద్ద నుంచి మాదివాడ గాంధీ చౌక్ వరకూ జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్లు, వెయ్యి మీటర్ల పొడవైన జాతీయ జెండాతో బిజెపి మండల అధ్యక్షులు కె.ఏడుకొండలు ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. స్థానిక కార్తికేయ జూనియర్ కళాశాల, ధరణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శారద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో జాతీయ పతాకాలతో నాయకులు మంగళవారం తిరంగా యాత్ర చేశారు. సెంటర్లోని జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేసి వారికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాలతో గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కవురు శ్రీను, మామిడిశెట్టి నరసింహారావు, దొంగ రామారావు, బల్ల సూరిబాబు, దొంగ నరసింహారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు మండలం దువ్వ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున స్థానిక శ్మశానవాటిక సమీపంలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.8,710 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఎజిఎస్.మూర్తి కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తణుకు రూరల్

అప్పుల బాధతో మనస్థాపం చెంది యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తణుకు మండలం దువ్వ గ్రామంలో చోటుచేసుకుంది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెంటపాడు మండలం అలంపురం గ్రామానికి చెందిన ఖండెల్లి సాయి దుర్గారావు అలీయాస్ సాయి (22) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. అయితే ఆర్థిక సమస్యల కారణంగా సోమవారం అర్ధరాత్రి దాటాక దువ్వ శివారు ప్రాంతంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఎట్టకేలకు బొండాడ మేజర్ డ్రెయిన్ ప్రక్షాళన

ప్రజాశక్తి - కాళ్ల

ఎట్టకేలకు బొండాడ మేజర్ డ్రెయిన్ ప్రక్షాళన పనులు చేపట్టారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం మురుగు కాల్వల ఆధునికీకరణపై దృష్టి పెట్టలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఇటీవల సార్వా నారుమడులు దెబ్బతినడంతో రైతులు సమస్యను ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు స్పందించి బొండాడ డ్రెయిన్ పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం నుంచి ఒఅండ్ఎం నిధులు రూ.14 లక్షలు మంజూరు కావడంతో డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు.

ప్రక్షాళన పనులు చేపట్టాం..
సోమిశెట్టి జయప్రకాశ్, డ్రెయినేజీ ఎఇ, భీమవరం

బొండాడ డ్రెయిన్‌లో ఒఅండ్ఎం నిధులు రూ.14 లక్షలతో ప్రక్షాళన పనులు చేశాం. రైతుల సహకారంతో పూర్తి స్థాయిలో పనులు జరిగాయి. డిసెంబర్ వరకూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు చేయాల్సి ఉంది. నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు చేపట్టాం.

బొండాడ మేజర్ డ్రెయిన్‌లో ప్రక్షాళన పనులు చేసిన తరువాత ఇలా

ఘనంగా భయానక విభజన స్మరణ దినోత్సవం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో ఫొటో ఎగ్జిబిషన్ : చీఫ్ మేనేజర్ సంగీత

ప్రజాశక్తి - భీమవరం

ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సంగీత

భయానక విభజన స్మరణ దినోత్సవాన్ని భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం మెయిన్ బ్రాంచిలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఫొటో ఎగ్జిబిషన్‌ను బ్యాంకు కస్టమర్లు, బ్యాంకు అధికారుల సమక్షంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సంగీత ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సంగీత మాట్లాడుతూ ఆనాడు పాకిస్తాన్ విభజన కోసం మత ప్రాతిపదికన ప్రజల్లో ఒక భయంకర ఆందోళనలు కల్పించి దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించారన్నారు. అప్పట్లో జరిగిన హింసాత్మక చర్యలకు ఎంతోమంది బలయ్యారని, అటువంటి దుశ్చర్యలు ఎక్కడా జరగకుండా దేశ వ్యాప్తంగా శాంతిపథంలో ఉండాలని ప్రధాని మోడీ భయానక విభజన స్మరణ దినాన్ని దేశవ్యాప్తంగా అన్ని రకాల ప్రజలు, ప్రభుత్వ శాఖలు, నిర్వహించాలని పిలుపు ఇచ్చారని తెలిపారు. దీనిలో భాగంగా భీమవరంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను రెండు రోజులపాటు ఏర్పాటు చేశామన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొండాడ రామ్మోహనరావు (రాంపండు), సంఘం సేవకులు చెరుకువాడ రంగసాయి, ఛాంబర్ మాజీ అధ్యక్షులు కనుమూరి సత్యనారాయణ రాజు, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి చినబాబు, రాష్ట్ర ఆక్వా పరిశ్రమ ఛైర్మన్ భీమాల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న పరిణామాలను బట్టి ఆనాటి విభజన దినం పునరావృతం కాకుండా దేశం శాంతి భద్రతలతో ఉండాలని ఆకాంక్షించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భీమవరం శాఖ చీఫ్ మేనేజర్ నిర్మలా జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గణపవరం : శిక్షణలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను పద్ధతి ప్రకారం వేరు చేయడం ద్వారా సంపద సృష్టించవచ్చని ఇఒపిఆర్‌డి వెంకటేష్ తెలిపారు. పారిశుధ్యంపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం రెండో రోజు జగన్నాథపురం ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు వద్ద శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెత్త ఏ విధంగా సేకరించాలి, సేకరించిన చెత్తను ఎలా వేరు చేయాలి తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి జగన్నాథపురం సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక అధ్యక్షత వహించగా సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాల్లో ప్రజలకు అంటు రోగాలు దరిచేరకుండా సర్పంచులు, కార్యదర్శులు పారిశుధ్యంపై పెట్టాలని ఎంపిడిఒ కె.సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : మండల పరిషత్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారీలో మార్కెటింగ్ వ్యవహారంలోనూ స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలో సర్పంచులకు, గ్రామ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి వాటిపై సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశానికి ఎఒ కె.గోవిందరాజులు, ఇఒపిఆర్‌డి వైభావతి హాజరయ్యారు.

పెనుమంట్ర : గ్రామ పంచాయతీలు అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకొని ఆదాయాన్ని పొందుతూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌లో రెండో రోజు గ్రామ సర్పంచి, గ్రామ కార్యదర్శుల శిక్షణలో భాగంగా క్షేత్ర సందర్శన నిర్వహించారు. స్థానిక పెనుమంట్ర సంత మార్కెట్ వద్ద ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రాసెస్‌ను పరిశీలించి, అవగాహన పొందారు.

పెనుగొండ : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి మండలాన్ని అగ్రభాగాన నిలపాలని ఎంపిడిఒ సుండం శ్రీనివాస్ దొర అన్నారు ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

దూర విద్యపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నామని నరసాపురం ఎంఇఒ-1 పి.పుష్పరాజ్యం అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు దూరవిద్యపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్యం మాట్లాడుతూ 14 ఏళ్లు నిండినవారు పదో తరగతి పరీక్షలకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇంటర్ అడ్మిషన్ పొందే అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించాలన్నారు. అడ్మిషన్లు తీసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. ఎంఇఒ-2 జాన్ ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలకు, పలు రకాల వ్యాపారాలు, చిరుద్యోగాల్లో ఉన్న వారికి ఎస్ఎస్‌సి, ఇంటర్ కోర్సుల్లో జాయిన్ అవ్వడానికి సువర్ణ అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో జి.వీరాస్వామి, విఎల్ఎన్.నాగేశ్వరి, జి.ఇందిరా వాణి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆచంట : దూర విద్య ద్వారా పది, ఇంటర్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ఎంఇఒ-1 ఎ.ఉషారాణి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆచంటలో దూర విద్యపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 14 సంవత్సరాలు నిండిన వారు పదో తరగతి అడ్మిషన్ పొందొచ్చన్నారు. పదో తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్ అడ్మిషన్ పొందొచ్చన్నారు. అడ్మిషన్లకు ఈ నెల 31వ తేదీ వరకూ గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు. అనంతరం దూర విద్యపై వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంఆర్ఒ సంధ్యారాణి, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లి అమ్మవారి జాతర

ప్రజాశక్తి - కాళ్ల

అమ్మవారి జాతరకు విచ్చేసిన యాత్రికులు

జువ్వలపాలెం గ్రామం తూర్పుపేటలో పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ జాతర రెండు రోజుల పాటు ఉంటుంది. 78 సంవత్సరాల నుంచి అమ్మవారి జాతర నిర్వహిస్తున్నారు. బుధవారంతో జాతర ముగియనుంది. విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి బంధువులు జాతరకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు అందుకుంటారు. ఇటీవల పైడితల్లి అమ్మవారి నూతన ఆలయం నిర్మాణం జరిగి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆలయం నిర్మాణానికి గ్రామస్తులు, యాత్రికులు, దాతలు సహకారం అందించారు. గోకరాజు సుబ్బారాజు - శైలజ దంపతుల ఆర్థిక సహకారంతో ఆలయ ముఖద్వారం, దాతలు, యాత్రికులు, గ్రామ పెద్దల సహకారాలతో ఆలయాన్ని నిర్మించారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, మాజీ టిటిడి ఛైర్మన్ కనుమూరు బాపిరాజు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామపెద్దలు, పైడితల్లి అమ్మవారి ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జాతర వైభవంగా నిర్వహించారు.

విత్తనాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

నష్టపోయిన ప్రతి రైతూ విత్తనాలను వినియోగించుకోవాలని నరసాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ అనిల్ కుమారి కోరారు. మంగళవారం మండలంలోని లింగనబోయిన చర్ల గ్రామంలో అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మైలాబత్తుల సోని, కటకంశెట్టి సంజీవ్‌రావు, గుబ్బల మర్రాజు పాల్గొన్నారు.

స్వాతంత్ర వేడుకలకు పతాక స్తూపం నిర్మాణం

ప్రజాశక్తి - పెనుమంట్ర

గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కోసం ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో జాతీయ పతాకావిష్కరణ కోసం స్తూపం నిర్మాణం జరుగుతోంది. స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు తేతలి సోమిరెడ్డి సోదరులు రూ.2 లక్షలతో స్తూపాన్ని నిర్మిస్తున్నారు. ఈ స్తూపం ఆవిష్కరణతో పాటు జాతీయ పతాకావిష్కరణను ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చేస్తారని టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా) తెలిపారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు ఆదేశాల మేరకు పట్టణంలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్, ర్యాబిస్ టీకాలు వేసేందుకుగాను జాతీయ జంతు సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియా వారిచే గుర్తింపు ఉన్న 'స్నేహ వెల్ఫేర్ సొసైటీ' సంస్థ అధికారికంగా అనుమతి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి తెలిపారు. మంగళవారం మున్సిపల్ అధికారులు స్వచ్ఛంద సంస్థ వారికి పలు సూచనలు ఇచ్చారు. స్థానిక అధికారుల కమిటీ పర్యవేక్షణలో నిబంధనలను అనుసరించి నిపుణులైన సిబ్బంది ద్వారా ప్రతి వార్డు వద్దా కుక్కలను పట్టుకుని వాటికి స్థానికంగా ఏర్పాటు చేసిన ఎబిసి సెంటర్, గునుపూడి, భీమవరం వద్ద నిపుణులైన పశు వైద్యులచే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించి తగు వైద్య, ఆహారం సదుపాయం అందిచి అవి కోలుకున్న నాలుగు రోజుల తరువాత మరలా యథాస్థానంలో విడచి పెట్టేందుకు నిర్ణయించారు.

15న మాంసాహార అమ్మకాలు నిషేధం

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణ పరిధిలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాంసం, చేపలు అమ్మడం నిషేధమని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. 15వ తేదీన నిబంధనలు ఉల్లఘించి మాంసం, చేపలు అమ్మినా, వధించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, పాలకొల్లు పట్టణము, డోర్ నెం.33-2-7Cరు కాపురస్తులు మంచెం హరి గోపాల కృష్ణ గారి భార్య మంచెం వీర కుమారి గారి అస్థికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్, మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం.215 లో విస్తీర్ణం 2.00 సెంట్లు ఆర్.యస్.నెం.224/2లో య.0.38 సెంట్లు వెరశి య.3.38 సెంట్లు గల 268/2007 తేది: 14.03.2007రుగా రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ను ఈ రోజు అనగా ది. 13.08.2024 వ తేదీన పాలిథిన్ కవర్ లో పెట్టుకుని పాలకొల్లు నుండి ఏలూరు వచ్చి ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళు చుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్ కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్ ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేది.13.08.2024 సెల్:9885576667

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు ముప్పవరం గ్రామంలోని శ్రీ నాగ హనుమాన్ సాల్వెంట్ అయిల్స్ ప్రయివేటు లిమిటెడ్, తరుపున మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఏలూరు పట్టణము, ఉప్పువారి వీధి కాపురస్తులు శ్రీ నూకల రంగారావు గారి కుమారుడు నూకల రామకృష్ణ గారి అస్తికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్ మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం.216/1 లో విస్తీర్ణం య.0.50 సెంట్లు గల 1112/2006 తేది.24.08.2006, ఆర్.యస్.నెం.224/2లో విస్తీర్ణం య.0.50 సెంట్లు గల 1255/2006- తేది.23.09.2006, ఆర్.యస్.నెం.206/3 లో విస్తీర్ణం య.1.09 సెంట్లు గల 1318/2006 తేది.09.09.2006, ఆర్.యస్.నెం. 216/1లో విస్తీర్ణం య.0.75 సెంట్లు గల 919/2006, తేది: 05.07.2006 రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను ఈ రోజు అనగా ది. 13.08.2024వ తేదీన పాలిథిన్ కవర్ లో పెట్టుకుని ఆ కవరు ను స్కూటర్ ముందు భాగములో పెట్టుకుని ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళుచుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్ కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్ ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేది.13.08.2024 సెల్:9885576667

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సిటీ, ఉప్పు వారి వీధి, డోర్ నెం. 7బి-15-45రు సిటిలోని శ్రీ నాగ హనుమాన్ ఫిష్ పాండ్స్ తరుపున మేనేజింగ్ పార్టనర్ అయిన ఏలూరు పట్టణము, ఉప్పువారి వీధి కాపురస్తులు శ్రీ నూకల రంగారావు గారి కుమారుడు నూకల రామకృష్ణ గారి అస్థికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్, మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం.211/1C లో విస్తీర్ణం 0.1.10 సెంట్లు, ఆర్ యస్ నెం.211/2C య.0.92 సెంట్లు, ఆర్ యస్ నెం. 215లో య.0.89సెంట్లు వెరశి 0.2.90 సెంట్లు గల 571/2008 తేది: 10.06.2008రుగా రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ను ఈ రోజు అనగా ది. 13.08.2024వ తేదీన పాలిథిన్ కవర్‌లో పెట్టుకుని ఆ కవరు ను స్కూటర్ ముందు భాగములో పెట్టుకుని ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళుచుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్‌కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్‌ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేది.13.08.2024 సెల్:9885576667

దస్తావేజులు పోయినవి

ప.గో.జిల్లా పాలకొల్లు పట్టణంకు చెందిన పసుపులేటి రమేష్, రాజీవ్ నగర్, పాలకొల్లు తెలియజేయునది ఏమనగా **ది 01-08-2024** న పాలకొల్లు పట్టణం లోని బెత్లెహేం పేటకు చెందిన మా ఒరిజినల్ స్థలం డాక్యుమెంట్ లు (నెంబర్ 14034) ఒరిజినల్ డాక్యుమెంట్ లు డూప్లికేట్ తీయించుటకు మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్ సెంటర్ కు వెళుతుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దారిలో దొరకలేదు.నా ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన నాకు అందజేయగలరు.

సెల్ : 8919014461

ప్రకటన

నా క్లయింటు ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, పి.నైనవరం గ్రామ కాపురస్తులైన చప్పిడి సాంబశివరావు (లేటు) గారి భార్య : చప్పిడి నాగేంద్రమ్మ నుండి సంజాయిషీ పొంది తెలియజేయుట ఏమనగా నా భర్త గారైన చప్పిడి సాంబశివరావు గారు మాదు (లేటు) రాయలు గారి కుమారుడు మాదు నాగయ్య గారి నుండి ఈ దిగువ ఆస్తి ది. 15-9-2011వ తేదీన దస్తావేజు నెం. 7602/2011 గన్నవరం ఎస్ఆర్ఓ నందు రిజిష్టరు పొంది అనుభవిస్తున్నారు. సదరు పై దస్తావేజుకు లింకు డాక్యుమెంటు నెం. 2436/1966 ఎస్ఆర్ఓ గన్నవరం ఒరిజినల్ దస్తావేజు నా వెంట వున్న బ్యాగ్‌తో సహా 7-8-2024 తేదీన ఉదయం 11 గం.లకు ఆకివీడు పాతబస్టాండ్ నుండి గుమ్మలూరు వెళ్ళుటకు ఆటో కోసమని ఎదురు చూస్తున్న సమయంలో పై దస్తావేజువున్న బ్యాగు పోయినది. చుట్టుప్రక్కల వెతికినా కనపడలేదు. పై దస్తావేజుపై ఎవరైనా ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల చెల్లనేరవని తెలియ జేయటమైనది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, వెదురు పావులూరు ఆర్.ఎస్. నెం. 207/2, ఎ.సి. 1.06 సెంట్లులో

ఇట్లు
తాడిబోయిన శ్రీనివాసరావు, ఎం.కాం., ఎం.ఎల్.,
న్యాయవాది,
డోర్ నెం. 77-126, ఆర్10,
ఏవీఎస్ రెడ్డి రోడ్డు, పాయకాపురం - 520015.
ఫోన్ : 8096735844, 6300101399

ప్రకటన

IN THE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE : BHIMAVARAM

O.S.No.1/2013

Plaintiff :
Prayaga Subrahmanya Prabhakara Chiranjeevi Rao

Defendants : 1. The Bhimavaram Municipal Council rep., by its Chairman, Bhimavaram Municipality, Bhimavaram and Others

12th Defendant : Gunduboyina Murali krishna, Foested son of Gunduboyina Vanumulu, D.No.14-7-10/4, Sree Lakshmi Narasimha Street, Mini Shiridi Sai Baba Temple Street, 26th ward, Gunupudi, Bhimavaram-1.

పై నెంబరు దావాలో వాది, 12వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికి 12వ ప్రతివాది అయిన మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. 12వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై నెంబరు దావాను పైకోర్టు వారు **ది.29-8-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. 12వ ప్రతివాది అయిన మీరు సదరు వాయిదా తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనియెడల సదరు దావాను 12వ ప్రతివాది అయిన మీ పరోక్షమందు తీర్మానించడమగును.

K.V.SURYANARAYANA
Advocate, Sarrajuvari Street,
Bhimavaram.
Cell : 98494 04488